గురువారం 04-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 384, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..


Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




**తొక్కిసలాటకు కారణం నిర్వాహకులే..**

వివరాలు 2లో



**15 రోజుల్లో కూలిన ఆరో బ్రిడ్జి**

వివరాలు 2లో



**గంజాయి సమాచారం ఇస్తే రూ.2 లక్షల బహుమతి**

వివరాలు 3లో




**ప్రపంచంలో అత్యంత క్రూరమైన జైలు**

వివరాలు 4లో

## 12 వరకు కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

### రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ




ముందడుగు ఢిల్లీ:

మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 12 వరకు పొడిగించింది. కేజ్రీవాల్‌ను ఈడీ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచింది. ఇంతకుముందు ఈడీ జూన్ 29న సీబీఐ కోర్టు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ప్రత్యేక సీబీఐ కోర్టు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో గత నెల 26న సీబీఐ అరెస్టు చేసిన విషయం విధితమే. ఆ తర్వాత మూడురోజులు సీబీఐ కస్టడీకి తీసుకోగా.. రిమాండ్ గడువు ముగియగా 29న కోర్టులో హాజరుపరిచింది. దీంతో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆప్ కన్వీనర్‌కు జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఆ తర్వాత స్టేపై సవాల్ చేయగా.. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన తిహార్ జైలులో ఉంటున్నారు.



## అవినీతి భూతాన్ని నాశనం చేద్దాం

- కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ
- రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ

ముందడుగు ఢిల్లీ:

దేశంలో అవినీతి భూతాన్ని నాశనం చేసేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యసభలో ప్రకటించారు. అందుకోసం తమ సర్కార్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వీటి నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరని హెచ్చరించారు.

తమపై మోడీ ప్రభుత్వం ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ప్రతిపక్షాలు కొంతకాలంగా ఆరోపణలు చేస్తుండడంపై ప్రధాని మోడీ తీవ్రంగా స్పందించారు. "దర్యాప్తు సంస్థలు నిజాయితీగా పని చేస్తాయి. ఏ అవినీతిపరుడు చట్టం నుంచి తప్పించుకోలేడు. ఇది మోదీ గ్యారంటీ. అవినీతి, నల్లధనాన్ని నిలువరించేందుకు కఠినచర్యలు తీసుకునేందుకు మా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఈ సందర్భంగా దేశ ప్రజలకు తెలియజేస్తున్నా. వాటి చర్యల్లో మా సర్కార్‌కు ఎలాంటి పాత్ర లేదు" అని స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ ఓటమితో దిష్టి పోయింది

కాంగ్రెస్‌కు ప్రజలు పొరపాటున ఓటేశారు ▪ మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్



ముందడుగు హైదరాబాద్:

లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమితో దిష్టి తీసినట్లైందని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ జిల్లా నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేశామనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. భారాసను తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటోందని మిగతా 2లో

## వందేభారత్ రైల్లో వర్షపు నీరు

### ఘటనపై స్పందించిన ఉత్తర రైల్వేశాఖ



ముందడుగు వారణాసి:

వందేభారత్ రైలు పైకప్పు నుంచి లోనికి నీరు చేరింది. ఢీల్లీ నుంచి వారణాసికి బయలుదేరిన రైలులో ఈ ఘటన చోటు చేసుకొంది. ఇటీవల వారణాసికి బయలుదేరిన మిగతా 2లో

ముందడుగు
గురువారం, 04-7-2024, హైదరాబాద్

# బిఆర్ఎస్ ఓటమితో దిష్టి పోయింది

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తితో ఉన్నారని, ఆ విషయం క్షేత్రస్థాయిలో కనిపిస్తోందన్నారు. పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణ కూడగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తనను కలిసేందుకు ముందస్తు సమాచారంతో మాత్రమే రావాలని సూచించారు. వారానికి రెండు నియోజకవర్గాల పేర్లు చెబుతానని, చెప్పిన వాళ్లు మాత్రమే వస్తే వారితో మనస్ఫూర్తిగా మాట్లాడతానని తెలిపారు.

# తొక్కిసలాటకు కారణం నిర్వాహకులే..

## హత్రాస్ ఘటనపై స్పందించిన భోలేబాబా

ముందడుగు ఉత్తరప్రదేశ్:

ఉత్తరప్రదేశ్ హత్రాస్ సత్సంగం తొక్కిసలాటకు కారణం నిర్వాహకులేనని భోలేబాబా అలియాస సాకర్ హరిబాబా తొలిసారిగా స్పందించారు. తొక్కిసలాటకు ముందే తాను అక్కడి నుంచి వెళ్లిపోయినట్లుగా పేర్కొన్నారు. ప్రమాదానికి కారణం నిర్వాహకులేనని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించిన ఆయన.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హత్రాస్‌లో జరిగిన సంఘటన అనంతరం భోలే బాబా మంగళవారం అర్ధరాత్రి మైన్‌పురిలోని బిచ్వాన్ పట్టణంలోని ఆశ్రమానికి చేరుకున్నారు. అక్కడ ఆయనను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. ఆ తర్వాత అక్కడ



పోలీసు బలగాలను మోహరించారు. సత్సంగంలో జరిగిన తొక్కిసలాటలో దాదాపు 124 మంది మృత్యువాతపడ్డారు. వందలాది మంది గాయపడ్డారు. ఘటనకు కారణమైన బాలే బాబా హత్రాస్ నుంచి బిచ్వాన్‌లోని తన విలాసవంతమైన ఆశ్రయానికి రాత్రికి చేరుకున్నారు. ఆయన రాకపై సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సీవో భోగావ్ సునీల్ కుమార్ సింగ్ పోలీసు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బలగాలను ఆశ్రమం వద్ద మోహరించారు. బాబాను గృహనిర్బంధంలో ఉంచారు. అయితే, ఆశ్రమంలో బాబా ఉన్నారా? అని పోలీసు అధికారులను ప్రశ్నించగా.. సమాధానం ఇచ్చేందుకు నిరాకరించారు. ఆశ్రయానికి చెందిన ఓ సేవకుడు భోలే బాబా ఆశ్రమంలోనే ఉన్నట్లు ధ్రువీకరించారు. మంగళవారం బాబా ఆశ్రయానికి వచ్చారని.. ఆ తర్వాత ఆశ్రమంలోకి అనుమతి నిషేధించారన్నారు. మరో వైపు ఈ వార్తలను పోలీసులు ఖండిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరిస్తున్నారు. మీడియా వ్యక్తులను సైతం ఆశ్రమం దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటూ వస్తున్నారు.

# వందేభారత్ రైల్లో వర్షపు నీరు

## ఘటనపై స్పందించిన ఉత్తర రైల్వేశాఖ

మొదటిపేజీ తరువాయి

వందేభారత్‌లో వర్షం కారణంగా పైకప్పు నుంచి నీరు లోనికి చేరింది. సీట్లన్నీ తడిచిపోవడంతో ప్రయాణికులు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఏకధాటిగా నీరు పైనుంచి రావడంతో ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగింది. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ప్రయాణికుడు రైల్వే సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ పోస్టు కాస్త వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. "వందేభారత్‌లో ఇప్పటివరకు క్యాటరింగ్ సమస్యే ఉండేది. ఇక నుంచి మరో కొత్త సమస్యను ఎదుర్కోవాలి" అని ఒకరు.. "ఇకపై ప్రయాణికులు తడుస్తూ ప్రయాణించవచ్చు. ధర ఎక్కువ సేవలు తక్కువ" అని కామెంట్లు గుప్పించారు. తాజా ఘటనపై ఉత్తర రైల్వే స్పందించింది. నీరు లోనికి రావడానికి గల కారణాన్ని వివరించింది. "ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. నీటి పైపులు తాత్కాలికంగా మూసుకుపోవడంతోనే ఈ విధంగా జరిగింది. నీరు లోనికి చేరింది. ఇలాంటి తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం" అని ఓ ప్రకటనలో ప్రయాణికులను క్షమాపణలు కోరింది.


# 15 రోజుల్లో కూలిన ఆరో బ్రిడ్జి

## బీహార్‌లో వరుసగా కూలుతున్న బ్రిడ్జిలు

ముందడుగు బీహార్:

బీహార్‌లో వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మరో బ్రిడ్జి కూలింది. సివాన్ జిల్లాలోని గండకి నదిపై నిర్మించిన ఈ చిన్న వంతెనలోని ఒక భాగం బుధవారం ఉదయం కూలిపోయింది. వంతెన కూలిపోవడానికి గల కచ్చితమైన కరణాలపై విచారణ జరుపుతున్నట్లు డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముఖేష్ కుమార్ తెలిపారు.

'బుధవారం ఉదయం డియోరియా బ్లాక్‌లోని వంతెన యొక్క ఒక భాగం కూలిపోయింది. బ్రిడ్జి కూలడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటివరకూ తెలియరాలేదు. సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటన తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వంతెన 1982-83లో నిర్మించారు. గత కొన్ని రోజులుగా ఈ వంతెనపై మరమ్మతు పనులు



జరుగుతున్నాయి' అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వంతెన కూలిపోవడం 15 రోజుల వ్యవధిలో ఇది ఆరోది. సివాన్ జిల్లాలో 11 రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. గత నెల 22న సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. దారౌండా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్..చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ కుమార్ గుప్తా తెలిపారు.

# మూడునెలలు సినిమా షూటింగ్‌లకు దూరం

- సేవ చేసుకుంటూ వీలున్నప్పుడు నటిస్తా
- ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కల్యాణ్

ముందడుగు ఆంధ్రప్రదేశ్:

మూడు నెలలపాటు సినిమా షూటింగ్‌లకు దూరంగా ఉంటానని ఏపీ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కల్యాణ్ స్పందించారు. వీలున్నప్పుడు ఒకట్రెండు రోజులు షూటింగ్‌కు కేటాయిస్తానని చెప్పారు. బుధవారం సాయంత్రం పిఠాపురంలో నిర్వహించిన వారాహి సభలో ఆయన మాట్లాడారు. సినిమాలపై స్పందించాలని అభిమానులు కోరగా.. ఆయన ఈ రమేరకు ప్రకటన చేశారు. "సినిమాలు చేసే టైమ్ ఉందంటారా..? కనీసం రోడ్డు గుంతలు కూడా పూడ్చలేదని మీరు నన్ను తిట్టకుండా ఉండాలి కదా. అందుకే ముందు చెప్పిన పని చేయాలి. లేదంటే 'నిన్ను ఎన్నుకుంటే నువ్వెళ్లి 'ఓజీ' చేస్తావా? క్యాజీ' అంటే నేనేం సమాధానం చెప్పాలి. షూటింగ్ విషయంలో క్షమించమని నిర్మాతలను కోరా. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవ చేసుకుంటూ వీలున్నప్పుడు నటిస్తానన్నా. 'ఓజీ' సినిమా బాగుంటుంది" అంటూ ఫ్యాన్స్‌లో ఆసక్తి రేకెత్తించారు. ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల షూటింగ్‌ను పవన్ కల్యాణ్ పూర్తి చేయాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆయా చిత్రాల షూటింగ్ వాయిదా పడింది. ఈ మూడు సినిమాల కోసం పవన్ అభిమానులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. సినిమాల్లో నటిస్తానని పవన్ స్వయంగా ప్రకటించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# రైలు పట్టాలు దాటుతుండగా మరణించిన వృద్ధుడు

## 5 కిలోమీటర్లు రైలుకు వేలాడుతూ వచ్చిన మృతదేహం

ముందడుగు హైదరాబాద్:

రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆ మృతదేహం రైలు ఇంజన్ ముందు భాగంలో చిక్కుకోవడంతో ప్రమాదం జరిగిన సంఘటన నుంచి ఘట్‌కేసర్ వరకు సుమారు 5 కిలోమీటర్లు అలాగే వేలాడుతూ వచ్చింది. ఘట్‌కేసర్ ప్రాంతంలో రైల్వే గేట్ పడగా.. రైలుకు మృతదేహం వేలాడుతూ రావడాన్ని చూసిన వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మృతదేహాన్ని చూసి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన రైల్వే పోలీసులు రైలును ఆపి మృతదేహాన్ని బయటకు తీశారు. బీబీనగర్, ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ మధ్య వృద్ధుడు రైలు దాటేందుకు ప్రయత్నం చేశాడని, ఇంతలో వరంగల్ నుంచి వస్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో వృద్ధుడు రైలు ముందు భాగానికి చిక్కుకోవడంతో సుమారు 5 కిలోమీటర్ల మేరకు వేలాడుతూ వచ్చిందని తెలిపారు. మృతి చెందిన వృద్ధుడు నీలం రంగు చొక్కాఆరెంజ్ లుంగీ, కుడిచేతికి కడియం ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, ప్యాసింజర్ రైలు.. వరంగల్ నుంచి సికింద్రాబాద్ వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది.

ముందడుగు
గురువారం, 04-7-2024, హైదరాబాద్

# గంజాయి సమాచారం ఇస్తే రూ.2 లక్షల బహుమతి

## 8712671111 నంబర్‌కు కాల్ చేయాలని సూచన

ముందడుగు తెలంగాణ:
తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించడానికి తెలంగాణ నార్కోటిక్స్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి స్మగ్లింగ్ గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇవ్వాలి అనుకున్నవాళ్లు 8712671111 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచించారు.
డ్రగ్స్, సైబర్ నేరాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా విస్తృత ప్రచారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిన సంగతి తెలిసిందే. డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగస్వామి అయిన మెగాస్టార్ చిరంజీవిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయనలా హీరో, హీరోయిన్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పౌరులకు అవగాహన





కల్పించాలని కోరారు. మీడియా ఫోకస్ రాజకీయ అంశాలకే పరిమితం కాకూడదని, డ్రగ్స్, సైబర్ నేరాలపైనా దృష్టిసారించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ యజ్ఞం విజయవంతమయ్యేందుకు పౌరసంబంధాలశాఖ, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, థియేటర్ యజమానులు, సినిమా ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై చిత్తశుద్ధితో పనిచేసే పోలీసులకు పదోన్నతులు, రివార్డులు ఇస్తామని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్స్, డ్రగ్సేనని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన నేరాలు, చిన్నారులపై అఘాయిత్యాలు డ్రగ్స్ మత్తులో జరిగినవేనని పేర్కొన్నారు. ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్‌కు బానిస కావొద్దని పిలుపునిచ్చారు.

# తాగి భార్యను టార్చర్ చేసిన భర్త

## ఓపిక నశించి స్క్రూ డ్రైవర్ తో పొడిచిన భార్య

ముందడుగు కృష్ణా:
తాగుబోతు భర్త టార్చర్ భరించలేక భర్తను స్క్రూ డ్రైవర్ తో భార్య పొడిచి చంపింది. ఈ ఘటన బంటుమిల్లి మండలం చిన్నతుమ్మడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పారావు, కీర్తనలకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల కొడుకు ఉన్నాడు. అప్పారావు నెమ్మదిగా తాగుడికి బానిసయ్యాడు. దీంతో తరచూ గొడవలయ్యేవి. మారుతాడని సర్దుకుపోయేది కీర్తన. మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో అప్పారావు తాగి ఇంటికి రావడంతో గొడవ జరిగింది. ఆ గొడవ కాస్తా పెద్దది కావడంతో.. కీర్తన ఆగ్రహంతో అప్పారావుపై దాడి చేసింది. చేతికి అందిన స్క్రూ డ్రైవర్ తో మెడపై



పొడవడంతో అక్కడికక్కడే అప్పారావు చనిపోయాడు.

విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించి.. కీర్తనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దంపతుల మధ్య గొడవకు కారణం అతను మద్యపానానికి బానిసవ్వడమేనా ? లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియాల్సి ఉంది.

# నాలా కన్వర్షన్‌కు 8 వేలు లంచం

## ఏసీబీకి చిక్కిన గోపాల్‌పేట తహసీల్దార్

గోపాల్‌పేట తహసీల్దార్ శ్రీనివాసులు ఓ రైతు నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన బుధవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో చోటుచేసుకున్నది. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ వివరాల ప్రకారం.. జింకలబీడు తండాకు చెందిన మూడావత్ పాండునాయక్ కోళ్లఫారం నిర్మించుకోవడానికి తన భార్య సౌందర్య పేరు మీద ఉన్న 15 గుంట ల వ్యవసాయ భూమిని నాలా(వ్యవసాయేతర భూమి)గా మార్చాలని గత నెల 21న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. నాలాగా



మార్చేందుకు రూ.15 వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేయగా.. రూ.8 వేలకు ఒప్పకున్న పాండునాయక్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం బుధవారం పాండునాయక్ తహసీల్దార్‌కు రూ.8 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# కొత్త చట్టం కింద ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

## అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

ముందడుగు హుజురాబాద్
అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదుతో కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టం కింద హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. భారత న్యాయ సంహిత సెక్షన్ 122, 126(2) కింద పోలీసులు కేసు ఫైల్ చేశారు. జడ్పీ సమావేశం నుంచి తన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వెళ్తున్నారంటూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం అడ్డుకున్నారు. ఆమె వెళ్లే మార్గంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జడ్పీ ఛైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగిన



చివరి సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఇతర అధికారులు హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతోపాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల హుజూరాబాద్ నియోజకవర్గంలో మండల విద్యాధికారులతో ఎమ్మెల్యే హోదాలో తాను విద్యాశాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహించానని.. అందులో పాల్గొన్న ఎంఈవోలకు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మెమోలు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యేతోపాటు భారాస జడ్పీటీసీలంతా డీఈవోను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీనిపై కలెక్టర్ సమాధానం చెప్పాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సభలో ఆందోళన పెరుగుతుండడంతో కలెక్టర్ పమేలా సత్పతి తన కుర్చీలో నుంచి లేచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే ఆమె ఎదుట నేలపై బైఠాయించారు. కొద్దిసేపు పోలీసులకు ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టర్ వెళ్లిన తర్వాత సభలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ జడ్పీటీసీ సభ్యులు పరస్పర విమర్శలు చేసుకున్నారు.

ముందడుగు
గురువారం, 04-7-2024, హైదరాబాద్

# ఉద్యోగులకు జీతాలు పెంచారని జైలుకు పంపారు

## దుకాణ యజమానులపై కఠిన చర్యలు



ముందడుగు మయన్మార్:
మయన్మార్‌లో ఉద్యోగులకు జీతాలు పెంచారన్న కారణంతో కొంతమంది దుకాణ యజమానులను అక్కడి సైనిక ప్రభుత్వం జైలుకు పంపించింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న వేళ సిబ్బందికి వేతనాలను పెంచడం నేరంగా పరిగణించింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కనీసం 10 మంది దుకాణదారులకు ఇదే కారణంతో మూడేళ్ల జైలు శిక్ష విధించింది. అంతేగాక, వారి వ్యాపారాలను బలవంతంగా మూసివేయించింది. మయన్మార్‌లో వేతనాల పెంపు చట్ట విరుద్ధమేమీ కాదు. కానీ, ద్రవ్యోల్బణ ఆందోళనల వేళ ఇలా జీతాలు పెంచడం వల్ల సమాజంలో అశాంతి నెలకొంటుందని సైన్యం భావిస్తోందట. ఇదే విషయాన్ని ఆయా దుకాణాల ముందు అంటించిన నోటీసుల్లో పేర్కొంది. వీరు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించింది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని 2021లో సైన్యం కూలదోసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి దేశంలో మిలటరీ పాలనలో ఉండగా.. తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నిత్యావసర ధరలు పెరగడం ఇతరత్రా సమస్యలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అదే సమయంలో ప్రజాస్వామ్య అనుకూలవాదులతో కూడిన సాయుధ బృందాలు కూటములుగా ఏర్పడి సైన్యంపై తిరుగుబాట్లు చేస్తున్నాయి. దీంతో దేశంలో అస్థిరత నెలకొంది.

# ప్రపంచంలో అత్యంత క్రూరమైన జైలు

## ఖైదీల వృషణాలకు విద్యుత్ షాక్‌లు ▪ ఊహించలేని హింసకు గురవుతారు

ముందడుగు ప్రత్యేకం:
తప్పు చేసిన వారిని తీసుకొచ్చి జైల్లో వేస్తారు. వారిలో మంచి మార్పు కోసం ప్రయత్నం చేస్తారు. కాని కొన్ని జైళ్లు అత్యంత దారుణంగా ఉంటాయి. అలాంటి జైళ్లలో ఫెడరల్ పెనిటెన్షియరీ సర్వీస్ ఒకటిగా నిలుస్తోంది. అక్కడ ఖైదీలు అమానవీయ పరిస్థితులలో జీవిస్తారు, ఊహించలేని హింసకు గురవుతారు. ఇది రష్యాలోని ఒరెన్‌బర్గ్ ఒబ్లాస్ట్‌లోని ఉంది. సాధారణంగా దీనిని బ్లాక్ డాల్ఫిన్ ప్రిజన్ అని కూడా అంటారు.

### అత్యంత దుర్మార్గులైన నేరస్థులు

ఇక్కడ ఖైదీల వృషణాలకు విద్యుత్ షాక్‌లు ఇస్తారని చెబుతారు. సీరియల్ కిల్లర్లు, పిల్లలను లైంగికంగా వేధించేవారు, నరమాంస భక్షకులు వంటి ప్రపంచంలోనే అత్యంత దుర్మార్గులైన నేరస్థులు ఈ రష్యన్ జైలులో ఉంటారు. ప్రస్తుతం ఇందులో 700 క్రిమినల్స్ శిక్షను అనుభవిస్తున్నారని సమాచారం. ఈ ప్రదేశం నుంచి బయటపడే ఏకైక మార్గం మరణం మాత్రమేనట. అంటే దీనిలోకి వెళ్లిన ఖైదీ జీవితం అక్కడే అంతమవుతుంది. ఈ జైలు ముఖ ద్వారం ముందు ఓ ఖైదీ తయారు చేసిన ఒక బ్లాక్ డాల్ఫిన్ విగ్రహం ఉంటుంది. దాని కారణంగా ఈ జైలుకి "బ్లాక్ డాల్ఫిన్ ప్రిజన్" పేరు వచ్చింది.

### ఖైదీలకు విద్యుత్ షాక్ ఇస్తారు

ఈ అత్యంత భద్రతా స్థాయి కలిగిన జైలులో 24




గంటలూ ఖైదీలను గమనించేందుకు శిక్షణ పొందిన గార్డ్స్ ఉంటారు. ఖైదీలు క్రూరమైన హింసలను భరించాల్సి వస్తుంది. దీనివల్ల వారి నరాలు చిట్లిపోతాయి. గార్డ్స్ ఖైదీల కాళ్లను దారుణంగా కొడతారు. హింసించేటప్పుడు లేదా విద్యుత్ షాక్స్ ఇచ్చేటప్పుడు నేరస్థులను బంధిస్తారు. బలవంతంగా "స్వాలో యోగా పొజిషన్"లో ఉండేలా చేస్తారు. ఈ పొజిషన్‌లో ఖైదీ తన కడుపుపై పడుకోవాల్సి ఉంటుంది. అలానే చేతులను వెనుకకు ఎత్తాలి, కాళ్లను పైకి లేపాలి.

### జైలులో 700 మంది ఖైదీలు

బ్లాక్ డాల్ఫిన్ జైలులో 700 మంది ఖైదీలు ఉన్నారని, వీరు అందరూ కలిసి 3,500 మందిని చంపారని, అంటే ఒక్కొక్క ఖైదీ సగటున ఐదుగురిని హత్య చేశారని మీడియా వర్గాలు తెలిపాయి. వారు చనిపోయే వరకు గదులకే పరిమితమవుతారు. ఇప్పటివరకు ఒక్క ఖైదీ కూడా బ్లాక్ డాల్ఫిన్ జైలు నుంచి తప్పించుకోలేదంటే ఎంత టైట్ సెక్యూరిటీ ఉంటుందో ఊహించుకోవచ్చు.

### ఖైదీలకు నరకం చూపిస్తారు

జైలులో నిత్యం నరకమే ఈ జైలులో గార్డ్స్ ప్రతి 15 నిమిషాలకు ఒకసారి గస్తీ తిరుగుతారు. ఖైదీలు గదుల నుంచి బయటకు వచ్చినట్లు గమనిస్తే వారికి నరకం చూపిస్తారు. వారిని నడుము వంచమని, చేతులు వెనుకకు పెట్టుకోమని, తుంటిపైకి ఎత్తి నడవమని బలవంతం చేస్తారు. ఖైదీలు పారిపోకుండా ఉండేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఈ పద్ధతితో ఖైదీకి చుట్టుపక్కల ఏమీ కనిపించకుండా చేసి, పారిపోయేందుకు ప్రణాళికలు వేయకుండా అడ్డుకోవచ్చు.

### ఖైదీలకు ఎలక్ట్రిక్ షాక్స్

బ్లాక్ డాల్ఫిన్ జైలులోకి ప్రవేశించిన వెంటనే ఖైదీలకు నియమాలు వివరిస్తారు. ఎవరైనా ఈ నియమాలను ఉల్లంఘిస్తే, వారి టెస్టికల్స్‌కు ఎలక్ట్రిక్ షాక్స్ ఇస్తారు, అరికాళ్లను చితక బాదుతారు. లేదా ప్రమాదకరమైన యోగా భంగిమలు చేయమని బలవంతం చేస్తారు. ఈ జైలులో ఉన్నవారు 1980లు, 1990ల నాటి నేర ముఠాలలో భాగమైన సీరియల్ కిల్లర్లు, ఉగ్రవాదులు అని సమాచారం.

# నీట్ పరీక్షపై హీరో విజయ్ సంచలన వ్యాఖ్యలు

## దేశంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్

ముందడుగు జాతీయం:
దేశంలో జరిగిన నీట్ వ్యవహారంపై తమిళ సూపర్ స్టార్, తమిళకి వెట్రి కజగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ స్పందించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకు సంబంధించి పరీక్ష రద్దు కోసం స్టాలిన్ ప్రభుత్వం శాసనసభలో చేసిన తీర్మానానికి మద్దతు ప్రకటించారు. నీట్ పరీక్షలో అవకతవకలతో సామన్య విద్యార్థులు చెప్పరాని ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క తమిళనాడులోనే కాకుడా దేశంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని విజయ్ కేంద్రాన్ని కోరాడు. నీట్ 2024 పరీక్షలో గ్రేస్ మార్కులు పొందిన అభ్యర్థులకు మళ్లీ పరీక్షలు






నిర్వహించారు. ఈ ఫలితాలను సోమవారం జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అలాగే నీట్ యూజీ 2024 అభ్యర్థులందరి ర్యాంకులను సవరించినట్లు పేర్కొంది. మొత్తం 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించగా.. 813 మంది మాత్రమే హాజరయ్యారని ఎన్టీఏ తెలిపింది. గ్రేస్ మార్కులు కలపడంతో 720 మార్కులు పొంది మొదటి ర్యాంకు సాధించిన 6 అభ్యర్థుల్లో అయిదుగురు మళ్లీ నిర్వహించిన పరీక్షకు హాజరు అయ్యారు. వారిలో ఏ ఒక్కరూ 720 మార్కులు సాధించలేక పోయారు.

# శ్వాసనాళంలో 25 పైసల నాణెం

## సురక్షితంగా బయటకు తీసిన డాక్టర్లు

ముందడుగు ఉత్తరప్రదేశ్:
40 ఏళ్ల వ్యక్తి శ్వాసనాళంలో 25 పైసల నాణెం చిక్కుకోవడంతో ఏళ్లుగా ఇబ్బంది పడ్డాడు. బనారస్ హిందూ యూనివర్శిటీ (బీహెచ్‌యూ)లోని సుందర్‌లాల్ హాస్పిటల్ డాక్టర్లు దీనిని గుర్తించారు. 8 ఏళ్లుగా ఆ నాణెం శ్వాసనాళంలో చిక్కుకున్నట్లు తెలిసి షాక్ అయ్యారు. కార్డియో-థొరాసిక్ సర్జన్ ప్రొఫెసర్ సిద్ధార్థ్ లఖోటియా, ప్రొఫెసర్ ఎస్‌కే మాథుర్ నేతృత్వంలోని వైద్యుల బృందం మంగళవారం 20 నిమిషాల పాటు సర్జరీ చేశారు. వ్యక్తి శ్వాసనాళంలో చిక్కుకున్న 25 పైసల నాణేన్ని సురక్షితంగా బయటకు తీశారు. పెద్దల్లో శ్వాసనాళంలోకి వస్తువులు ప్రవేశించడం చాలా అసాధారణమని డాక్టర్లు తెలిపారు. ఎనిమిది ఏళ్లుగా దీనిని గుర్తించలేదన్నారు. ఇలాంటి వాటి వల్ల ప్రాణహాని కలుగవచ్చని తెలిపారు. ఊపిరితిత్తులను



దెబ్బతీయం, న్యుమోనియాకు దారి తీయడం వంటి ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఇతర సమస్యల వల్ల కూడా రోగులు చనిపోయే అవకాశం ఉందని అన్నారు. మరోవైపు మరో వ్యక్తి శ్వాసనాళంలో పదేళ్లపాటు చిక్కుకున్న అల్మారా తాళంచెవిని కూడా బీహెచ్‌యూ డాక్టర్లు ఇటీవల విజయవంతంగా బయటకు తీశారు.

TELANGANA B.C. WELFARE RESIDENTIAL EDUCATIONAL INSTITUTIONS SOCIETY
Learn To Lead

## గురుకుల పాఠశాలలకు చికెన్, మటన్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ముందడుగు హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలకు గుడ్లు, చికెన్, మటన్ సరఫరా కోసం టెండర్ల ప్రకటన వెలువడింది. ఆసక్తి గల వారు సీల్డ్ టెండర్లను సమర్పించాల్సిందిగా రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య వర్మ తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ నగర్ మన్సూరాబాద్ లోని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నుంచి దరఖాస్తులు తీసుకొని పూర్తి వివరాలతో అక్కడే అందించవచ్చని పేర్కొన్నారు. జూలై 5 సాయంత్రం 5 గంటల లోపు టెండర్లను దాఖలు చేయాలని అన్నారు. జూలై 6న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీల్డ్ కవర్లను తెరిచి అర్హులైన సరఫరాదారులను ప్రకటిస్తారని వెల్లడించారు. టెండర్లకు సంబంధించిన మరింత సమాచారం కోసం 8309838150, 9154102724, 9121167320 సంప్రదించాలన్నారు.

## విజయ్ సేతుపతి జోడీగా..

'స్కైలాబ్' తర్వాత తెలుగు సినిమాలకు దూరమైపోయింది మలయాళీ భామ నిత్యామీనన్. అయితే తమిళ, మలయాళ భాషల్లో మాత్రం తన అభిరుచికి తగిన కథాంశాలను ఎంచుకొని సినిమాలు చేస్తున్నది. గత కొంతకాలంగా కమర్షియల్ చిత్రాల్లో మంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్నదీ అమ్మడు.

ఈ నేపథ్యంలో తమిళంలో విజయ్‌సేతుపతి సరసన భారీ ప్రాజెక్ట్‌లో నాయికగా ఖరారైనట్లు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల 'మహారాజ' చిత్రంతో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు విజయ్ సేతుపతి. ఈ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఆయన నటనకు సర్వత్రా ప్రశంసలు లభించాయి.

ఈ నేపథ్యంలో పాండిరాజ్ దర్శకత్వంలో తన తదుపరి సినిమాకు సన్నద్ధమవుతున్నారు విజయ్ సేతుపతి. ఇందులో నిత్యామీనన్ కథానాయికగా నటించనుందని తెలుస్తున్నది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నిత్యామీనన్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చెబుతున్నారు. త్వరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.



## 30 ఏళ్ల స్వచ్ఛత మరియు ఆరోగ్యకరమైన ఉత్పత్తిని అందిస్తున్న సన్‌ప్యూర్

ముందడుగు హైదరాబాద్: దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఎడిబుల్ ఆయిల్ బ్రాండ్, సన్‌ప్యూర్ తన తాజా మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది, ఇది భారతదేశంలోని ఏకైక భౌతికంగా శుద్ధి చేసిన సన్‌ఫ్లవర్ ఆయిల్, సన్‌ప్యూర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ చుట్టూ కేంద్రీకృతమై ఉంది. "30సంవత్సరాల స్వచ్ఛత మరియు ఆరోగ్యం" అనే శీర్షికతో ఈ ప్రచారం ఒక యువ జంట పంచుకున్న సంతోషకరమైన వారి రోజువారీ ఆనందంలో ఉత్పత్తి పాత్రను హైలైట్ చేస్తుంది. సాంప్రదాయ మరియు డిజిటల్ మీడియాలో ఏడాది పొడవునా, బహుభాషా ప్రచారం మా రోజువారీ జీవన నాణ్యతను మెరుగుపరచడానికి విశ్వసనీయ బ్రాండ్ నుండి స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను చేర్చడం యొక్క విలువను నొక్కి చెబుతుంది. ప్రచారం గురించి మాట్లాడుతూ, శ్రీధర్ వైద్యనాథన్, సివోవో, యంకె ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్




ఇలా వ్యాఖ్యానించారు, "ఈ ప్రచారం రుచి మరియు నాణ్యత యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని మాత్రమే కాకుండా, రసాయన రహిత సన్‌ప్యూర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ యొక్క ప్రయోజనాలను కూడా వివరిస్తుంది. వాణిజ్య ప్రకటనలు, డిజిటల్ ఛానెల్‌లు, మార్కెటింగ్, ప్రింట్ మరియు అవుట్‌డోర్ మీడియా వంటి విభిన్న ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విస్తరించబడుతుంది, ఇది సన్‌ప్యూర్ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ మరియు యూట్యూబ్ ఛానెల్‌లో కూడా ప్రముఖంగా ప్రదర్శించబడుతుంది".

HDFC BANK
We understand your world

## కొత్త ఇంజినీర్డ్ ప్లాట్‌ఫారమ్‌కు మార్చాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యోచన

ముందడుగు హైదరాబాద్: భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జూలై 13, 2024న తన సిస్టమ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటోంది. దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది వ్యక్తులు, వ్యాపారాల కోసం వినియోగదారుని అనుభవాన్ని పెంపొందించే లక్ష్యంతో బ్యాంక్ తన కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ని కొత్త ఇంజనీరింగ్ ప్లాట్‌ఫారమ్‌లోకి మారుస్తోంది. ఈ మార్పు బ్యాంక్ పనితీరు వేగాన్ని మెరుగుపరచేందుకు, అధిక ట్రాఫిక్ పరిమాణాన్ని నిర్వహించుకుంటూ, తన సామర్థ్యాన్ని విస్తరించుందకు, విశ్వసనీయత మరియు పరిమాణాన్ని పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఈ అప్‌గ్రేడ్‌తో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను న్యూ-జెన్ ప్లాట్‌ఫారమ్‌లో హోస్ట్ చేసేందుకు దేశంలోని దాని పరిమాణంలో, బ్యాంకింగ్ వాల్యూమ్‌లో అతిపెద్ద బ్యాంకులలో ఒకటిగా నిలుస్తుంది. ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో సమగ్ర సమాచారం Click here to read the FAQs ఇక్కడ క్లిక్ చేయండి లేదా మా వెబ్‌సైట్ www@hdfcbank.comని సందర్శించండి.